

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 07 నవంబర్ 2025 పేజీలు : 04


# మా రెవెన్యూ డివిజన్లను యథాతథంగా కొనసాగించండి

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి
- రెవెన్యూ మంత్రి, కమిషనర్, ఇరు జిల్లాల కలెక్టర్లకు లేఖలు
- నియోజకవర్గ పరిస్థితులను వివరిస్తూ లేఖ రాసిన ఎమ్మెల్యే సునీత



ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, నవంబర్ 6 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గ పరిధి లోని రెండు రెవెన్యూ డివిజన్లను యథాతథంగా కొనసాగించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, ఒక నియోజకవర్గంలోని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న దానిపై మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూ శాఖలు యోచిస్తున్న తరుణంలో ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న మండలాల పరిస్థితుల గురించి వివరిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కు లేఖలు రాశారు. రాప్తాడు నియోజకవర్గం భౌగోళికంగా చాలా భిన్నమైన పరిస్థితిలో ఏర్పడిందని ఇక్కడ మొత్తం 6 మండలాలు ఉండగా, జిల్లాల విభజన సమయంలో 3 మండలాలు అనంతపురం జిల్లాలో మరో 3 మండలాలు శ్రీ సత్యసాయి జిల్లాలో చేర్చారన్నారు. ఈ క్రమంలో 3 మండలాలు అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో, మరో 3 మండలాలు ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయని వివరించారు. అనగా రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలు అనంతపురం జిల్లాలోని అనంతపురం రెవెన్యూ డివిజన్ లో ఉండగా, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలు శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంటాయన్నారు. భౌగోళికంగా, ప్రజల అవసరాలు, పరిపాలన సౌలభ్యపరంగా ఇది అందరికి అనుకూలంగా ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ఒక నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనే నిర్ణయం తీసుకుంటోందని.. అందుకే తమ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాలను ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తే చాలా ఇబ్బందులు తలెత్తుతాయని.. ఉదాహరణకు అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోగల ఆత్మకూరు మండలంలోని కొన్ని గ్రామాల నుంచి వయా అనంతపురం మీదుగా శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని ధర్మవరం రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వెళ్లాలంటే సుమారు 80 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాగే ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోగల రామగిరి మండలంలోని గరిమేకలపల్లి తదితర గ్రామాలు మరియు చెన్నేకొత్తపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, గంగినేపల్లి తదితర గ్రామాల నుంచి వయా ధర్మవరం మీదుగా అనంతపురం ఆర్డీవో కార్యాలయానికి రావాలంటే సుమారు 80 నుంచి 85 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. రైతులు, ప్రజలు, విద్యార్థుల సౌకర్యం కోసం, అలాగే పరిపాలన సౌలభ్యం కోసం శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని కనగానపల్లి రామగిరి చెన్నేకొత్తపల్లి మండలాలను ప్రస్తుతం ఉన్న విధంగా ధర్మవరం రెవెన్యూ డివిజన్లోనే కొనసాగించాలని అలాగే అనంతపురం జిల్లా పరిధిలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలను ప్రస్తుతం ఉన్న విధంగా అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోనే కొనసాగించాలని ఎమ్మెల్యే సునీత కోరారు.

### పిపిపికి వ్యతిరేకంగా

# యువత ఉద్యమించాలి

- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

- మెడికల్ కాలేజీల కోసం రూ.5వేలకోట్లు ఖర్చు చేయలేవా చంద్రబాబు : బైరెడ్డి సిద్దార్థ రెడ్డి
- అనంతలో కోటి సంతకాల కార్యక్రమానికి అనూహ్య స్పందన





విలేకర్లతో మాట్లాడుతున్న అనంత, బైరెడ్డి యువతతో సంతకాలు చేయిస్తున్న వైసిపి నేతలు

**అనంతపురం సిటీ, నవంబర్ 6 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ తీసుకొచ్చిన పిపిపి విధానానికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన కోటి సంతకాల కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానానికి శ్రీకారం చుట్టి, వైద్య విద్యను సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేసే ప్రయత్నం చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పిపిపి విధానాన్ని తీసుకొచ్చి ప్రైవేట్ వ్యక్తులకు వాటిని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని వైసిపి ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతోందన్నారు. బైరెడ్డి సిద్దార్థరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు తుఫాన్ ప్రభావాన్ని తగ్గించాలంటాడని, అతని కొవడుకు లోకేష్ మహిళ వరల్డ్ కప్ గెలిచేలా కృషి చేశారని చెప్పుకుంటారని ఇన్ని చేసే వారు రూ.5వేల కోట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాలల కోసం ఖర్చు చేయలేరా అని ప్రశ్నించారు. 17 నెలల కాలంలోనే రూ.2.27 లక్షల కోట్లు ఖర్చు చేశారని, పేదల వైద్యం కోసం ఎందుకు ఖర్చు చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. పిపిపి విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించినా వైసిపి అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేస్తుందని స్పష్టం చేశారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర మాట్లాడుతూ.. వైసిపి హయాంలో నిర్మితమైన మెడికల్ కళాశాలలో తరగతులు కూడా ప్రారంభమైనా అవగాహన లేని కూటమి ఎమ్మెల్యేలు కాలేజీలే కట్టలేదని మాట్లాడుతుండటం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపే వరకు యువజన విభాగం ఆధ్వర్యంలో పోరాడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మధన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతి నాయుడుతో పాటు, పలువురు యువజన విభాగం నేతలు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

# భారీ అవినీతి



- ❖ ప్రైవేట్ వ్యక్తుల ఫోన్ పేలో లక్షల్లో లావాదేవీలు
- ❖ ప్రాథమికంగా ఏసీబీ అధికారుల నిర్ధారణ

హిందూపురం, నవంబరు 6 ప్రభాతవార్త తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న చిలమత్తూర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం పై రెండు రోజు కూడా ఏసీబీ అధికారుల సోదాలు కొనసాగాయి. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరిగే రిజిస్ట్రేషన్ ద్వారా దండుకొని అవినీతి సొమ్మును ఒక ప్రైవేటు వ్యక్తి ఖాతాలో కి ఫోన్ పే ద్వారా వెళ్లినట్టు వేసి ఏసీబీ అధికారులు గుర్తించారు. అదేవిధంగా సబ్ రిజిస్టర్ కార్ డ్రైవర్ గా పని చేసే వ్యక్తి ఖాతాలోకి ఆన్లైన్ పేమెంట్ లావాదేవీలు లక్షల్లో జరిగినట్టు నిర్ధారణకు వచ్చారు. రిజిస్ట్రేషన్ లో చేయించేందుకు వచ్చిన వారి నుంచి భారీగా అవినీతి సొమ్మును ఈ మీడియేటర్ ల ద్వారా వసూలు చేసి తదుపరి సబ్ రిజిస్టర్ ఉద్యోగులకు అది చేరుతున్నట్లు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గల పలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో అవినీతి గూర్చి ప్రభుత్వానికి అధికంగా ఫిర్యాదులు తలెత్తడంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు మూకుమ్మడిగా సోదాలు నిర్వహించడం విషయం విదితమే. చిలమత్తూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంపై ఏసీబీ అధికారులు చేసిన సోదాలు 21గంటల పాటు విస్తృత తనిఖీలు గురువారం ఉదయం 9 గంటల వరకు సాగాయి. కార్యాలయంలో ఉన్న సబ్ రిజిస్టర్ ప్రసాద్ బాబుతో పాటు సిబ్బంది మరియు 4 ప్రైవేటు వ్యక్తులతో పాటు ఓ డాక్యుమెంట్ రైటర్ ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు వారిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ తర్వాత ఇసి, నకలుకి సంబంధించిన ఫీజులు నమోదు చేసిన రికార్డులు, రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులు, కార్యాలయం అంతటా అణువణువు సోదాలు చేశారు. ఎందుకు వచ్చారు, ఏ పని నిమిత్తం వచ్చారు, అని వారి సంబంధీకుల ఫోన్ నంబర్ల ను సైతం సేకరించారు. ఈ సోదాలలో కార్యాలయంలో అదుపులోకి తీసుకున్న వారి నుండి నగదు లభ్యం కాకపోవడంతో రాత్రంతా తమ దైన శైలిలో ఏసీబీ అధికారులు ఓ ప్రక్క వారికి కావాల్సిన దస్తావేజులు జిరాక్స్ తీసుకుంటూ మరో ప్రక్క అదుపులోకి తీసుకున్న వ్యక్తుల పై ఒక్కొక్కరిగా అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారని తెలిసింది. అదుపులో ఉన్న వ్యక్తుల వద్ద ఫోన్ లలో చేసిన నగదు లావాదేవీల వివరాలను పరిశీలించి, ఏసీబీ అధికారులకు కావాల్సిన కీలక సమాచారాన్ని వారి వద్ద నుండి సేకరించారు. ఉదయం 9 గంటలు కావడంతో అదుపులోకి తీసుకుని విచారించిన సబ్ రిజిస్ట్రారు ను, సిబ్బందితో పాటు మిగిలిన వారందరినీ కార్యాలయం నుండి బయటకు పంపి అక్కడి నుండి అధికారులు వెళ్లిపోయారు. సోదాలలో పాల్గొన్న వారిలో ఏసీబీ సిఐ హమీద్, ఇన్ స్పెక్టర్ జయమ్మ తో పాటు ఏసీబీ సిబ్బంది ఉన్నారు.

## 15 వందల ఏళ్ల క్రితమే...

# గుహలు గుళ్ళుగా మారాయి

-నోలంబ పల్లవ శిల్ప శైలికి ప్రతీక...హేమావతి - చరిత్రకారుడు మైనాస్వామి



ఆలయంలోని మూలవిరాట్

**గోరంట్ల, నవంబర్ 6 ప్రభాతవార్త**

అత్యద్భుత శిల్పకళకు ఆలవాలమైన ఆరు ఆలయాలు ఒక మారు మూల కేంద్రంలో వున్నాయి. ఆ సముదాయంలోకి వెళ్ళి ప్రత్యక్షంగా చూస్తే తప్ప ఆ గుడుల గొప్పదనం తెలియదు. భారతదేశంలో తొలి దశలో గుహలను తొలచి గుడులుగా తీర్చిదిద్దారు. దాదాపు 1500 సంవత్సరాలకు పూర్వం ఒకేగదితో రాతి నిర్మాణంగా దేవాలయం రూపు దిద్దుకొన్నది. తర్వాత క్రీస్తుశకం 7వ, 8వ శతాబ్దాల్లో ఆలయాలు అద్భుత కళా నిలయాలుగా తీర్చిదిద్దబడ్డాయి. దక్షిణాదిలోను తొలి నాళ్ళలో చాళుక్యులు, పల్లవులు, గంగరాజులు, నోలంబ పల్లవ ప్రభువులు కోవెలలకు విశేష రూపాలను కల్పించారు. గర్భగుడి, అంతరాళం, ముఖ మండపం, మహా మండపం, ఉత్సవ మండపం, యాత్రికుల బసమండపాల నిర్మాణంతో గుడి సంపూర్ణ రూపాన్ని సంతరించుకొన్నది. గర్భగుడిలోని మూలవిరాట్‌లను ఎంతో సుందరంగా మలిపించడం, వివిధ మండపాల స్తంభాలను శిల్పాలతో అందంగా తీర్చిదిద్దడం వంటి వాటితో ఆలయాలు అత్యున్నత కళా కేంద్రాలయ్యాయి. ఆదిలోనే అద్భుతాలకు ఆటపట్టుగా "హేమావతి గుడు"లను తీర్చిదిద్దిన ఘనత నోలంబ పల్లవ ప్రభువులదే. సామాన్య శకం 8వ, 9వ శతాబ్దాల్లోనే ఆలయ నిర్మాణాల్లో సరికొత్త పంథాలను అనుసరించి, తమ సొంత శైలికి శ్రీకారం చుట్టారు నోలంబులు. చోళులు సైతం నోలంబపల్లవ శిల్ప శైలిని స్వీకరించారు. హేమావతిలోని శివ సన్నిధులు నోలంబపల్లవ శైలికి ప్రత్యక్ష నిదర్శనం. సిద్ధేశ్వర, నోలంబేశ్వర (దొడ్డేశ్వర), మల్లేశ్వర, విరుపాక్షేశ్వర, చిత్రేశ్వర, సోమేశ్వర దేవలాలు సామాన్య శకం 8, 9 శతాబ్దాల్లో హేమావతిలో నిర్మితమయ్యాయి. హేమావతి ప్రాచీన పేర్లు హెంజేరు, పెంజేరు. హెంజేరు రాజధానిగా నోలంబ పల్లవులు దాదాపు 400 సంవత్సరాలు పాలించారు. దక్షిణ భారతావనిలో కొంత భాగంలో నోలంబ ప్రభువుల ముద్ర బలంగా వున్నా...వారి చరిత్రను అధ్యయనం చేయడంలో, వారు సాధించిన విజయాలను నమోదు చేయడంలో చరిత్రకారులు సరైన పాత్రను పోషించలేదు. సంస్కృతం, తెలుగు, కన్నడ, తమిళ భాషలను రాజ్యంలోని ప్రజలు పాటిస్తున్న సంస్కృతి - సంప్రదాయాలను పరిరక్షించడంలో నోలంబపల్లవ రాజులు ముందు వరుసలో వున్నారని వారు రాయించిన శాసనాల్లో పేర్కొనడం జరిగింది. నోలంబులు కట్టించిన కోవెలలకు భూరి దానాలు, గుడుల నిర్వహణ, రాజవంశ వివరాలు తదితర అంశాలు శాసనాల్లో వున్నాయి. హెంజేరు(హేమావతి) నుంచి ఆనెగొంది (హంపి), మరోవైపు ధర్మపురి (తమిళనాడు) దాకా నోలంబ పల్లవుల శాసనాలు కనిపిస్తాయి. హేమావతి పరిసరాల్లో శివ లింగాలు విశేషంగా కనిపిస్తాయి. ఆలయాల్లో మాత్రమే కాకుండా ఆరుబయలులోనూ శివలింగాల దర్శనం కలుగుతుంది. నోలంబవాడి రాజ్య రాజధాని కేంద్రం హెంజేరులో పెద్ద గుడులు 6 వుండగా, అందులో 5 శివలింగాలున్నాయి. ప్రధాన దేవాలయమైన సిద్ధేశ్వర సన్నిధిలో శివుడు సిద్ధుని (భైరవ)రూపంలో భక్తులకు అభయమిస్తున్నాడు. మిగతా ఐదుచోట్ల లింగరూపంలో ముక్కంటి భక్తులను బ్రోస్తున్నాడు. ఐదు లింగాలతో అలరారుతున్నందున హేమావతి పంచలింగ క్షేత్రం అయింది. సిద్ధేశ్వర స్వామి, పంచలింగాల దర్శనం, ఆలయాల్లోని శిల్పశోభ, పురావస్తు ప్రదర్శనశాలలోని శిల్ప సంపద యాత్రికులను భక్తి సాంస్కృతిక సాగరంలో ముంచెత్తుతాయి. హేమావతి ఆంధ్రప్రదేశ్‌లోని మడకశిరకు 36 కి.మీ. దూరంలో వుంది.



వివరాలు వెల్లడిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

## సచివాలయ సిబ్బంది

# ఆచూకీ తెలపండి



- ❖ సచివాలయంలో ఖాళీ కుర్చీలే ఉన్నాయి
- ❖ ఒకరు లీవ్‌లో.. మరొకరు ఫీల్డ్‌కి.. మరొకరు మీటింగ్‌కు ఇక ఉండేదెవరు పని చేసేదెవరు..
- ❖ ఉన్నవారు చేస్తారా.. అంటే మా పని కాదంటారు
- ❖ ఇదే.. సమస్య ప్రజలను సచివాలయం చుట్టూ తిప్పుతోంది

**నంబులపూలకుంట నవంబర్ 6 ప్రభాతవార్త**

మండల పరిధి మరికొమ్మ దిన్నె సచివాలయంలో కార్యదర్శిలు సమ యపాలన పాటించక పోవడంతో కుర్చీలు తప్ప సచివాలయం సిబ్బంది కనిపించడం లేదు. సిబ్బంది విధి నిర్వహణ ఇలా ఉంటే ప్రజలకి కూటమి ప్రభుత్వం అందించే సేవలు ప్రజలకు ఎలా అందుతాయని, సంబంధిత పర్యవేక్షణ అధికారి తూతూ మంత్రంగా నిర్వహించడం వలన సచివాలయం సిబ్బంది విధి నిర్వహణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజల నుంచి విమర్శలు వినపడుతున్నాయి. ఒకరు లీవ్‌లో ఉన్నారు.. మరొకరు ఫీల్డ్‌కి వెళ్తారు.. మరొకరు మీటింగ్‌కు వెళ్ళారు..అని చెప్పడమే తప్ప అక్కడ సచివాలయ సిబ్బంది ఒకరు మాత్రమే ఉండి ఇలాంటివి చెబుతూ ఉంటారు. ఫీల్డ్ అంటే ప్రజల్లోకి వెళ్లడమే వారికి సంబంధించిన ఫోన్ నెంబర్ ఇవ్వండి అక్కడైనా కలుస్తామంటే సార్ లేరు ఫీల్డ్‌లో ఉన్నారు అన్న సమాధానం తప్ప వేరేది రాదు, గట్టిగా అడిగితే మాపై దౌర్జన్యం చేస్తున్నారంటూ బుసలు కొడతారు. ఇకపోతే లీవ్‌లో ఉన్నవారు ఎప్పుడు వస్తారంటే సోమవారం ..సోమవారం వస్తారు. ఇదొక్క వారమే ఉన్నట్లు పదే పదే అదే చెబుతారు. ఇక పోతే మీటింగ్ వెళ్లిన సార్..ఎప్పుడు వస్తారంటే వస్తారు అంతే..మీటింగ్ పొద్దున్నుంచి సాయంత్రం అటునుంచి అటే..పనుల కోసం వచ్చే ప్రజలు తిరిగి..తిరిగి.. వేచి చూసి వెనక్కి వెళ్లి పోవాల్సిందే. ఇక వారు తంబు వేయ డానికి వచ్చిన సమయంలో వస్తే కొద్ది సేపు వదులుకోని రండి సర్వర్ బిజీగా ఉందంటూ చెప్పడం ఇదంతా ప్రజలకు ఇబ్బందిగా ఉందంటూ ఎవరికి చెప్పు కోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయంలోని కార్య దర్శిల మధ్య కోఆర్డినేషన్ ఉండాల్సిన దానికన్నా ఎక్కువై తమ సొంత పను లపై వెళ్లిపోతున్నా ఇలా ఒకరినొకరు సమర్థించుకుంటూ కాలం నెట్టుకొ స్తున్నారు. ప్రజలు మాత్రం ఇబ్బందులు పడుతూ తరచూ సచివాలయంకు వచ్చి పోతూనే ఉన్నారు. ఇక మహిళా పోలీస్ గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. మహిళ పోలీస్ అంటే తమ పరిధిలోని గృహాలలోని మహి ళలు, అక్కడ జరుగుతున్న అసాంఘీక కార్యక్రమాలను పరిశీలిస్తూ జరగబో యే వాటిని అంచనా వేసి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించి వాటిని పరిష్కరించే విధంగా ఉండాలి. కాకపోతే ఇక్కడ ఆ విధంగా లేదం టూ ప్రజలు, మహిళలు అంటు న్నారు. అసలు మహిళా పోలీస్..! అని అవాక్కవుతున్నారు. ఎందుకంటే మీ దగ్గర ఆమె (మహిళా పోలీస్ లేదా గ్రామ రక్షక్) నెంబరైనా ఉందా అని ఎవరైనా ప్రశ్నిస్తే అలాంటి వారి నెంబర్లు మా దగ్గర లేవని సమాధానం ఇస్తున్నారు. ఇకపోతే పింఛన్ల సమయంలో అయితే ఆ ఒక్క పనే ఉన్ననట్లు హడావుడి చేస్తూ పింఛన్లు ఇస్తున్నారు కానీ ఇంటింటికీ వెళ్లి ఇవ్వడానికి ఇబ్బంది పడుతూ అందరూ ఒకే చోటుకి రండి అంటూ హుకుం జారీ చేస్తూ పొద్దున్నే ప్రజల ఇంటి ముందుకు వీరు పోవడం మానేసి మీరే మా వద్దకు రండి అంటూ చెప్పి అందజేస్తున్నారు. వారు ఇచ్చిన సమయంలో పోతే అక్కడ పింఛన్ దొరుకుతుంది. లేదంటే మళ్లీ మనం ఆ సచివాలయ ఉద్యో గిని వెతుక్కుంటూ సచివాలయం వద్దకు పరుగులు తీయాల్సిందేనని వృద్ధులు వాపోతున్నారు. పై అధికారుల పర్య వేక్షణ కరువై ఈ విధంగా సచివాలయ ఉద్యోగులు వ్యవహరిస్తున్నారని ప్రజ లు బహిరంగంగానే చెబుతున్నారు. ఇకపోతే స్మార్ట్ రేషన్ కార్డులు సచివా లయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పంపిణీ చేయాలని తెలియ జేయగా అవన్నీ కట్టలు కట్టి సచివాలయంలో ఒక బాక్సు లో వేశారు. వాటిని వెతికి తీసుకెళ్లండంటూ చెబుతున్నారు. ఇంతవరకు సచివాలయ పరిధిలో ఉన్నటువంటి స్మార్ట్ రేషన్‌కార్డులు సగం మంది తీసుకెళ్లగా మిగిలినవి అలాగే ఉండి పోయాయి, ఇంకా లబ్దిదారులు వస్తూనే ఉన్నారు, వెతుకుతూనే ఉన్నారు చిక్కిన వారు తీసుకెళ్తున్నారు. ఇక కొంత మందివి రాలేదని, కొంత మందివి మిస్ అయ్యాయని గగ్గోలు పెడుతున్నారు. ఈ సమస్యలు లేకుండా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సచివాలయ సిబ్బంది పంపిణీ చేసి ఉంటే బాగుండేది కదా అని ప్రజలు అంటున్నారు. ఇంకనైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయంలో ఉద్యోగులు ప్రజలకి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రతి మనిషికి కంటి చూపే జీవితానికి వెలుగు 4 >


# సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రీవెన్స్..

- ❖ అర్జీలను స్వీకరించిన అహుడ చైర్మన్ టీసి వరుణ్, వైస్ చైర్ పర్సన్ శివ నారాయణ శర్మ
- ❖ రెవెన్యూ సమస్యలు అహుడ గ్రీవెన్స్ లో ఇవ్వొద్దు
- ❖ సమీక్ష సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ



అర్జీలు స్వీకరిస్తున్న కూడా చైర్మన్ టి సి వరుణ్

**అనంతపురం, నవంబరు 06 ప్రభాతవార్త**

అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహి స్తున్నట్లు అహుడ చైర్మన్ టీసీ వరుణ్ తెలిపారు. గురువారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అహుడ చైర్మన్ వరుణ్, వైస్ చైర్ పర్సన్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ లు వివిధ సమస్యలపై పలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. అహుడ గ్రీవెన్స్ లో రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీలను ఇవ్వొద్దని వారు అర్జీదారులకు సూచించారు. అహుడ పరిధి లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు అధికారులను ఆదేశించారు. అనంతరం అహుడ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంఐజి లేఅవుట్లు, పింక్ టాయిలెట్ల నిర్మాణం, పెనుగొండ సెంట్రల్ లైటింగ్, అనంతపురం లో స్విమ్మింగ్ పూల్, వివిధ అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. చైర్మన్ వరుణ్, వైస్ చైర్ పర్సన్ శివ నారాయణ శర్మ లు సమీక్ష సమావేశంలో చర్చించిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని అర్బుడా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కే ఎం డి.ఇషాక్, ఎగ్జిక్యూట్ ఇంజినీర్ దుష్యంత్, జ్యోతి, డి ఈ రేవంత్, జే పి ఓ హరీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఆస్తమా వైద్య శిబిరం




కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డి.ఇ రమేష్ కుమార్

హిందూపురం టౌన్ నవంబర్ 06 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలోని నింకంపల్లిలోని సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో గురువారం ఆస్తమా అలర్జీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 500 మంది రోగులకు శాఖాహార ఆస్తమా మందులను నిర్వాహకులు ఉచితంగా అందజేశారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా ఆచార్య రామానుజానంద అవధూత, హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి.ఇ రమేష్ కుమార్, విద్యారణ్య ఆవాసం కార్యదర్శి రత్నయ్య, చారుకీర్తి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఆస్తమా రోగులకు మందులు పంపిణీ చేయడం సంతోషించేదగ్గ విషయమని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మణికంఠ, సుబ్రహ్మణ్యం, రవీంద్ర పాల్గొన్నారు. వైద్య శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి హిందూసురక్షసేవాసమితి తరపున చారుకీర్తి కృతజ్ఞతలు తెలిపారు

## వసతి గృహాల సమస్యలు పరిష్కరించండి




తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

హిందూపురం టౌన్ నవంబర్ 06 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ బిసి బాలుర కళాశాల వసతి గృహాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురువారం పిడిఎస్యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు బాబావలి పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహంలో 50 మంది విద్యార్థులు ఉన్నారని వీరికి సరైన సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హాస్టల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, వర్షాలు వస్తే గదుల పైకప్పు ఎప్పుడు కూలుతుందో అంటూ విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. ప్రజలకు డోర్లు కిటికీలు లేవని దీంతో దోమలు రావడంతో విద్యార్థులు అనారోగ్యానికి కూడా గురవుతారని అన్నారు. నూతన మరుగుదొడ్ల నిర్మాణానికి ఆరు లక్షలకు పైగా నిధులు మంజూరైనప్పటికీ వాటిని నిర్మించకుండా వదిలేసారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వసతి గృహంలో సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పట్టణ అధ్యక్షుడు నందీశ్, నాగేంద్ర, భగత్, దిలీప్, అబీ, నరసింహ, అజయ్, కిరణ్, రఘు, వీర, ప్రవీణ్, నిరంజన్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం

- వైఎస్ఆర్‌సిపి నేత వేణురెడ్డి



కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న వేణురెడ్డి

చిలమత్తూరు, నవంబర్ 6 ప్రభాతవార్త

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దామని వైఎస్ఆర్‌సిపి నేత వేణురెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల సేకరణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని వేణురెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చిలమత్తూరు, దేమకేతేపల్లి పంచాయితీల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రతి ఒక్క ఆంధ్రుడు వ్యతిరేకించాలన్నారు. వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో పేదలకు వైద్య విద్య అందించాలని, పేదలకు మెరుగైన వైద్యం కోసం 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో ఆరు మెడికల్ కళాశాలలు పూర్తి అయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలకు తెరతీసిందన్నారు. దీంతో పేదలకు వైద్య విద్య, వైద్యం దూరమవుతుందన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలు చూశారని, చంద్రబాబు స్వార్థపు నిర్ణయాలను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ ప్రధాన కార్యదర్శి సురేష్, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా, యూత్ వింగ్ సంయుక్త కార్యదర్శి వరుణ్డి, ఎంపిటిసి రాఘవేంద్రరెడ్డి, మాజీ మండల కన్వీనర్ మద్దిపి లక్ష్మినారాయణ, నాయకులు దివాకర్‌రెడ్డి, హరి, లక్ష్మినారాయణరెడ్డి, మాజీ ఎంపిటిసి లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్, మద్దిలేటి, షాకీర్, నవాబ్, నయిముల్లా, నాగభూషణరెడ్డి, శివారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నవీష్, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పల్లెలో...కోటి సంతకాల్లో "పంకా" నేతలు

-వడిగేపల్లి, రెడ్డిచెరువుపల్లి పంచాయతీల్లో...మండల కన్వీనర్ వెంకటేష్ ఆధ్వర్యంలో సంతకాలు



రచ్చబండ వద్ద సంతకాల సేకరణలో పార్టీ శ్రేణులు

గోరంట్ల, నవంబర్ 6 ప్రభాతవార్త

గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం కోసం 17 నూతన కాలేజీలను మంజూరు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధం అవుతోందని వాటిని నిరసిస్తూ ప్రభుత్వం కళ్ళు తెరిపించే విధంగా ప్రజల నుంచి కోటి సంతకాల సేకరణకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టినట్లు గోరంట్ల మండల పార్టీ కన్వీనర్ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని వడిగేపల్లి, రెడ్డిచెరువుపల్లి పంచాయితీ కేంద్రాల్లో ప్రజల నుంచి సేకరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వడిగేపల్లి పంచాయతీ కేంద్రంలో స్థానిక పార్టీ నాయకులు రామాంజనరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుబ్బు, చెన్నారెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. అలాగే రెడ్డిచెరువుపల్లి పంచాయతీ కేంద్రంలో స్థానిక పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, ఆనంద్, ఆది, తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటా సంతకాలు సేకరించినట్లు మండల కన్వీనర్ వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు పంచాయతీలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా సిరివరం నూతన సచివాలయ భవనం

- పట్టించుకోని ఉన్నతాధికారులు




ముళ్ళపొదలతో నిండిపోయిన సిరివరం నూతన సచివాలయం

లేపాక్షి, నవంబర్ 6 ప్రభాతవార్త

మండలంలోని సిరివరం గ్రామ సచివాలయం కంచిసముద్రం రహదారిలో ప్రశాంత వాతావరణంలో నిర్మించబడింది. నూతన భవనం నిర్మాణాలు పూర్తయినా ప్రవేశానికి నోచుకోకపోవడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నూతన సచివాలయాలను మంజూరు చేయడం జరిగింది. సిరివరం సచివాలయం దాదాపు 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించారు. 2023 సంవత్సరంలోనే సచివాలయం ప్రారంభానికి సిద్ధమైంది. అయితే ఇప్పటికీ దాదాపు రెండేళ్ళు గడిచినా ఆ భవనం నిరుపయోగంగా ఉండిపోయింది. ప్రభుత్వ నిధులు లక్షలాది రూపాయలు వెచ్చించి అన్ని హంగులతో నిర్మించిన సచివాలయ భవన ప్రవేశానికి మోక్షం ఎప్పుడని పలు విమర్శలు వెల్లి వెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా సిరివరం గ్రామానికి దాదాపు ఒక కిలోమీటర్ దూరంలో సచివాలయాన్ని నిర్మించారు. సచివాలయ ఉద్యోగులు అక్కడికి వెళ్లలేక వసతులు లేని పాత భవనంలోనే విధులు నిర్వహించడం విడ్డూరంగా ఉందని పలు విమర్శలు వెల్లి వెత్తుతున్నాయి. సచివాలయం పనిమీద సిరివరం గ్రామానికి సులభంగా రావచ్చన్న కారణంతో ప్రజలు కూడా నూతన భవనం పట్ల మక్కువ చూపడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే సచివాలయం నూతన భవనానికి మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఎంపి నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

-పాల్గొన్న కూటమి నాయకులు...ఆనందం వ్యక్తం చేసిన పేద ప్రజలు



భూమిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాయకులు

గోరంట్ల, నవంబర్ 6 ప్రభాతవార్త

పేదల కుటుంబాలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్న ఆలోచనతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్తీక్ యాదవ్, బోర్‌వెల్ అశ్వత్‌రెడ్డి, నీలకంఠా రెడ్డి తదితరుల కోరిక మేరకు హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార సారధి 10 లక్షలు తన సొంత నిధుల నుండి మంజూరు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని నాల్గవ వార్డు పరిధిలోని పులేరు రోడ్డు, గుడిసెల కాలనీ ప్రాంతంలోని నివాస ప్రాంతాలకు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆ ప్రాంత ప్రజలు మొర పెట్టుకోవడంతో స్పందించిన ఎంపి పార్థసారధి నిధులు మంజూరు చేయడం వెను వెంటనే భూమి పూజ చేసి రోడ్డు పనులు సైతం ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. ఇందులో భాగంగా గురువారం ఆ కాలనీలో భూమి పూజ కార్యక్రమాలకు ఎంపి బికె పార్థసారధి వర్గీయులు అశ్వత్‌రెడ్డి, నీలకంఠా రెడ్డి, నరేంద్ర రాయల్, కార్తీక్‌యాదవ్, మరెడ్డిపల్లి నరసింహులు, బిజెపి మండలాధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ, జనసేన మండల అధ్యక్షులు సంతోష్ కుమార్ తదితరులు నేతృత్వంలో భూమి పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు స్పందిస్తూ ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు లేక ఎన్నో కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఎంపి పార్థసారధి స్పందించి స్థానిక నాయకుల చొరవతో మా ప్రాంతంలో రోడ్డు వేయడం ఆనందంగా ఉందని కృతజ్ఞత తీర్చుకుంటామని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపల్లి ఫిరోజ్, కమ్మవారిపల్లి బాలకృష్ణ, ఈశ్వరయ్య, అవినాష్‌తో పాటు బిజెపి నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ పూల గంగాధర్, శంకర, జనసేన నాయకులు వీర మహిళ వాల్మీకి కావేరి, సింగిల్ విండో డైరెక్టర్ గుంటిపల్లి నగేష్, తిరుపాల్, గాజుల రమేష్ పాల్గొన్నారు.

## ఎంపీడీవో పై మాజీ ఎంపీపీ భర్త దాడి

- ఎంపీడీవో మద్దతుగా ప్రభుత్వ ఉద్యోగులు



వైకాపా నాయకుడి పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మడకశిర టౌన్ నవంబర్ 6 ప్రభాతవార్త

రోళ్ళ మండలం లో బిల్లుల విషయమై ఎంపీడీవో నాగేశ్వర శాస్త్రి మాజీ ఎంపీపీ కవిత భర్త విజయ రంగే గౌడ్ మధ్య ఘర్షణ జరిగింది పంచాయతీ పోలీస్ స్టేషన్న కు చేరింది గురువారం మధ్యాహ్నం మాజీ ఎంపీపీ కవితా భర్త విజయ రంగేగౌడ్ ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లి ఎంపీడీవో నాగేశ్వర్ శాస్త్రీ ని పెండింగ్ బిల్లులు వెంటనే పూర్తి చేయాలని విజయ రంగేగౌడ్ కూరగా ప్రస్తుతం మండల సర్వసభ్య సమావేశం తీర్మానం అయిన తర్వాతనే బిల్లు చేయడం జరుగుతుందని ఎంపీడీవో సమాధానం ఇచ్చారు దీంతో ఆగ్రహానికి గురైన మాజీ ఎంపీపీ కవిత భర్త విజయ రంగే గౌడ్ ఎంపీడీవో పై దుర్భాషలాలతో దాడికి ప్రయత్నించాడని ఎంపీడీవో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు కార్యాలయం నుండి బయటకు వచ్చి కారు ఎక్కువ పోతుండగా చెప్పు విసిరాడని దీంతో తన డ్రైవర్ ఎంపీపీ నిర్వహించారని ఎంపీడీవో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## జాతీయ సమైక్యత ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న దృశ్యం

లేపాక్షి, నవంబర్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షిలో హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుండి నంది విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్ మాట్లాడుతూ కులమత భేదాలను విస్మరించేందుకు అన్ని మతాలు ఒకటేనని చాటి చెప్పేందుకు జాతీయ సమైక్యత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లో కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యం

- కొత్తచెరువు సిహెచ్‌సిలో ఉచిత కంటి స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్





ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం, వైద్య సిబ్బందితో వైద్యశాల సమస్యలను చర్చిస్తున్న దృశ్యం

శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) నవంబరు 6 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి)లో గురువారం వైద్య ఆరోగ్యశాఖ డి ఎం హెచ్ ఓ మరియు డిసిహెచ్ఎస్ ఆధ్వర్యంలో బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి ఆరోగ్యాన్ని పెంపొందించడం, నివారించగల అంధత్వాన్ని తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇటువంటి కమ్యూనిటీ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి అని తెలిపారు. కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడంలో వైద్య, ఆరోగ్య శాఖ మరియు శంకర కంటి ఆసుపత్రి చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరంలో కొత్త చెరువు మరియు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, ఉచిత కంటి పరీక్షలు, చికిత్సా సలహాలు మరియు శస్త్ర చికిత్సలకు సంబంధించిన సూచనలు పొందారు. సమాజానికి నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిరంతరం సహకరిస్తున్న జిల్లా వైద్య యంత్రాంగం మరియు శంకర కంటి ఆసుపత్రి బృందానికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజా బేగం, డిసిహెచ్ఎస్ డాక్టర్ మధుసూదన్, డిపిఎంఓలు డాక్టర్ అనూరాధ, డాక్టర్ అశ్వత్ కుమార్, మరియు డిఐఓ డాక్టర్ సురేష్ బాబు, శంకర్ నేత్రాలయ వైద్యులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్ నవంబర్ 06 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు సూచించారు. పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించి వాటికి పరిష్కారం చూపాల సూచించారు. నియోజకవర్గంలో చాలామంది రైతులు పంటలు పండించి వాటికి మార్కెట్ సౌకర్యం లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ఫార్మర్ కమ్యూనిటీ గ్రూప్ ద్వారా పంట ఉత్పత్తులు అమ్మకాలు కొనసాగించే విధానానికి శ్రీకారం చుట్టాలని తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీల్లో రైతులు పండించే పంటల వివరాలు సాగు విస్తీర్ణం ,పంట దిగుబడి వాటి వివరాలను రైతు కేంద్రాల్లో నమోదు చేయాలన్నారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. గ్రామైక్య సంఘాల ద్వారా పంట ధాన్యం కొనుగోలు ,లేదా వివిధ వృత్తి నైపుణ్యాల ద్వారా తయారుచేసిన వస్తువులకు మార్కెటింగ్ చేసి పుట్టపర్తి నియోజకవర్గంలో ఒక బ్రాండ్ ను ఏర్పాటు చేసుకునే విధంగా దృష్టి పెడితే మంచిదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి మండల వైస్ ఎంపీపీలు మండల ప్రజా ప్రతినిధులు విజయ్ కుమార్ ,శ్రీరామ్ రెడ్డి ,పుల్లప్ప ,అధికారులు స్థానిక సర్పంచులు శ్రీనివాసులు, ఎంపీటీసీలు మధురిమ , పెద్దన్న ,గ్రామ కార్యదర్శులు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అక్రమ ఓట్లతో గద్దెనెక్కి అరాచక పాలన చేస్తోంది



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మవరంటౌన్, నవంబరు 6 ప్రభాతవార్త

బీజేపీ పార్టీ అక్రమ ఓట్లతో గద్దెనెక్కి అరాచక పాలన సాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ విమర్శించారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో శాశ్వతమైన సంస్కరణల కోసం ప్రజల కోసం దేశం కోసం ప్రాణాలు సైతం లెక్కచేయని కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం మాత్రం ప్రజలను మోసం చేస్తూ ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్నారన్నారు. అక్రమ ఓట్లతో గద్దెనెక్కిన వారు రాహుల్ గాందీని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నాయకులు ఎక్కడ స్వాతంత్రం పోరాటంలో పాల్గొన్నారో చెప్పాలని ఆయన ప్రశ్నిం చారు. కులాలు, మతాల పేరుతో అరచాకాలు చేస్తున్నబీజేపీ రాజ్యాంగ ఏతరశక్తిగా ఎదగాలని చూస్తోందన్నారు. 2029లో కష్టపడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలీమ్, దాదాపీర్, రాజు, గణేశ్, బాషా, అమీర్ పాల్గొన్నారు.

## మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం



ఎక్సైజ్ సీఐ చంద్రమణి

ధర్మవరంటౌన్, నవంబరు 6 ప్రభాతవార్త

ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిదిలోని బత్తలపల్లి, ముదిగుబ్బలో రెండు మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానించినట్టు ధర్మవరం ఎక్సైజ్ సీఐ చంద్రమణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బత్తలపల్లిలోని షాపు నెంబరు13, ముదిగుబ్బలోని షాపు నెంబరు 18లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇందుకు రూ.2 లక్షలు డీడీ తీసి వాటికి ఆధార్ కార్డు జతచేసి ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 10వతేదీ సాయంత్రం 5గంటల లోపు ఆన్ లైన్ కానీ ఆఫ్ లైన్ కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 12న సత్యసాయిజిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో లక్కీడ్రా తీయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

## పట్టుపురుగు పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

బుక్కపట్నం, నవంబర్ 06, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున పట్టుపురుగుల పెంపకం చేపట్టేవారు. కాగా ఈ పట్టు పరుగుల పెంపకం ఎన్నో అవరోధాలతో కూడుకుంది కనుక రైతులు ఆ పంట పెట్టేందుకు సాహసించడం లేదు. గతంలో ఐదుసార్లు మేత వేసేవారు. అయితే ప్రతిసారి తట్టలు శుభ్రపరచడం ఇబ్బందిగా ఉండేది. మట్టిని తెచ్చి దానిని చాలా నిష్ణగా ఉంచి అవి పగలగానే మల్బరీ ఆకులను శ్యానే రూపంలో మేతగా వేసేవారు. పట్టుపురుగులు నాలుగు దఫాలుగా జలుబుగా ఉంచి అనంతరం అవి మేతమేసేవి. ఇప్పుడు అలా కాకుండా మూడో జ్వరం అనంతరం రైతులకు ఇవ్వడం జరుగుతుంది. మల్బరీ ఆకులను సైతం కొమ్మలతోనే వేసిన పురుగులు శ్యాంపులకు వస్తాయి. దీనికి తోడు ప్రభుత్వం పట్టుపురుగుల పెంపకానికి ప్రోత్సాహం ఇస్తుండడంతో తక్కువ పెట్టుబడి తక్కువ శ్రమతోనే ఎక్కువ లాభాలు వస్తున్నాయి.కావున రైతులందరూ సిరికల్చర్ అధికారుల ను సంప్రదించి వారి ప్రోత్సాహంతో పెద్ద ఎత్తున పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికంగా ఎదగాలని పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి తెలియ జేశారు. ఈ మేరకు బుధవారం సిరికల్చర్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేస్తూ రైతులను చైతన్యపరిచి పెద్ద ఎత్తున పట్టుపురుగుల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

## చెత్తమయంగా మారిన పిల్లిగుండ్ల క్వార్టర్స్ ప్రధాన వీధులు

చెత్త సేకరణ పై దృష్టి పెట్టని గ్రేడ్ 4 కార్యదర్శి దివాకర్



పిల్లిగుండ్ల క్వార్టర్స్ ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్త

అనంతపురం రూరల్, నవంబర్ 06 ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పిల్లి గుండ్ల కోటర్స్ పోవు ప్రధానవీధులలో చెత్త పేరుకుపోయి చెత్తమయంగా మారిపోయాయని కాలనీలకు వెళ్లేప్రజలుగుసగుసలాడుకోవడం జరుగుతుంది. ప్రధాన వీధులన్నీ చెత్తతామయంగా మారిన వీటిని శుభ్రం చేయించడం పై పంచాయతీ గ్రేడ్ 4 కార్యదర్శి దివాకర్ దృష్టి పెట్టడం లేదనే మాటలు పంచాయతీలో వినిపించడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంచాయతీ కార్యదర్శి ఉదయం ఏడు గంటలకు వెళ్లి పంచాయతీ కార్మికులతో కలిసి ఇంటి ఇంటి నుంచి తడి పొడి చెత్త సేకరణ చేయాలని ఆదేశించిన ఇక్కడ మాత్రం ప్రభుత్వ ఆదేశాలు కానీ, జిల్లా అధికారుల ఆదేశాలు కానీ కొంతకాలంగా జరగడం లేదని మాటలు ఇందుకు ఉదాహరణ ప్రణ ప్రధాన వీధులన్నీ చెత్తతో పేరుకపోవడమే, కేవలం ఒక్క పిల్లిగుండ్ల కోటర్స్ ప్రధాన వీధుల్లోనే ఈ విధంగా చెత్త పేరుకుపోవడం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది, మరి పంచాయతీలో అనేక లోతట్టు కాలనీలు ఎన్నో ఉన్నాయి, ఆ కాలనీలో ఇంకా చెత్త ఎలా ఉందో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామాలలో చెత్త సేకరణ పై మండల అధికారులు కూడా దృష్టి సాధించి గ్రామ వీధుల్లో ఉన్న చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరారు.

## కంపెనీలపై త్వరలో చర్యలు తీసుకుంటాం

ఏ డి ఏ జి ఎం అల్తాఫ్ అలీ ఖాన్.

అనంతపురం రూరల్, నవంబర్ 06 ప్రభాతవార్త



అల్తాఫ్ అలీఖాన్

అనంతపురం రూరల్ మండలంపాపంపేట శివారులో ఉన్న ఎన్ఆర్ ఫర్టిలైజర్స్ పై రూరల్ పోలీస్ స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. బిల్లులు లేకుండా వివిధ ఫర్టిలైజర్స్ విక్రయం, బిల్లులు సక్రమంగా నిర్వహించడం లేదంటూ ఆటోను, ఎరువుల మందులను మండల అగ్రి కల్చర్ అధికారి సీజ్ చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు ఎన్ ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం లో సీజ్ చేసిన 6 టన్నుల కాంప్లెక్స్ ఎరువుకు సంబంధించిన ఎటువంటి బిల్లులు లేకుండా 3 ఆటో ల లో పంపడం పై కోరమాండల్ కంపెనీకి, కోరమాండల్ కంపెనీ కి చెందిన ఎరువులను నిర్వహణ బాధ్యత చేపట్టుతున్న అవంతి వేర్ వీరుహౌసింగ్ వారికి ఎరువులు రవాణా చేసిన మూడు ఆటోలపైన అదే విదంగా ఎన్ ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణం పై కూడా రూరల్ పోలీస్ స్టేషన్లో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారని. ఆ కేసు వివరాలు తెలుసుకున్న తర్వాత కోరమాండల్ కంపెనీ, అవంతి గోడౌన్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏడిఏ జిఎం అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసైనికులకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న చైర్మన్, జన సేన నాయకులు

కొత్తచెరువు నవంబర్ 6 ప్రభాతవార్త.

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం కి చెందిన జనసైనికులు అరుణ్ కుమార్ మరియు లక్ష్మణ్ సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పుట్టపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ , జనసేన పార్టీ నాయకులు తో కలసి గురువారం వారి స్వగ్రామానికి వెళ్లి మరణించిన ,గాయపడిన కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైరం కల్పించారు అనంతరం మరణించిన వారి కుటుంబ సభ్యులకు 25000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగినది గాయపడి చికిత్స పొందుతున్న బన్నీ జనసైనికుడికి 20,000 వేలు రూపాయలు అందించడం జరిగింది. జనసేన పార్టీ ఎప్పుడు మీ కుటుంబాలకు తోడుగా ఉంటుంది అని బరోసా ఇవ్వడం జరిగింది. కుటుంబ సభ్యులు జనసేన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

గుమ్మఘట్ట నవంబర్ 06 ప్రభాతవార్త

మండలకేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం కార్యక్రమం నిర్వహించడం జరిగుతుందని ఎంపీడీవో జయరాములు తెలిపారు ఈ కార్యక్రమానికి ఎంపిపి జడ్పీటీసీ సర్పంచ్ లు ఎంపిటిసి లు కోఆప్షన్ మెంబర్లు ఆయా శాఖల మండల అధికారులు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు

## ఆదాయం పెంచుటలో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం
### - కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.చంద్రశేఖర్



ఆర్టిసి ఉద్యోగులను ప్రసంశిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

కదిరి, నవంబర్ 6 ప్రభాతవార్త

స్థానిక ఆర్టిసి డిపోలో ఆదాయం పెంచుటలో ఆర్టిసి ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమని కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం కదిరి ఆర్టిసి డిపోను తనిఖీ చేశారు. బస్టాండ్ పరిసరాలను పరిశీలించి ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టిసి ఆదాయంతోపాటు ఆర్టిసి డిపోకు ఆదాయం రావడానికి కృషి చేస్తున్న డిపో మేనేజర్ మైనుద్దీన్‌ను అభినందించారు. కార్యక్రమంలో పదవీ విరమణ ఉద్యోగులు ప్రధాన సలహాదారులు హరిమోహన్, అసిస్టెంట్ ఇంజినీర్, రామకృష్ణ, కార్గో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టిఓకు వినతి



ఆర్టిఓ వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రైవేట్ స్కూల్ యజమానులు

కదిరి, నవంబర్ 6 ప్రభాతవార్త

ప్రైవేట్ స్కూల్ యజమానుల ఆధ్వర్యంలో గురువారం కదిరి ఆర్టిఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు పాలవల అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన దురదృష్టకరమైన బస్సు ప్రమాదం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల బస్సులపై కొత్త నిబంధనల పేరుతో తనిఖీలు చేపట్టామని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 10 నుంచి పాఠశాలల బస్సులపై తనిఖీలు ప్రారంభం అవుతాయని ప్రైవేట్ పాఠశాలలకు ఇప్పటికే నోటీసులు అందాయన్నారు. ఈ విషయంపై తమ రాష్ట్ర సంఘం నాయకులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారని, ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని తమకు కొంత సమయం కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ మంచి శివశంకర్, హరీష్ పాఠశాల కరస్పాండెంట్ ఎంఎస్.కిరణ్, షిర్డి సాయి పాఠశాల కరస్పాండెంట్ సురేష్‌బాబులు పాల్గొన్నారు.

## అనధికార మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న అనధికార మద్యం బాటిళ్ళతో ఎక్సైజ్ శాఖా అధికారులు మరియు సిబ్బంది

అనంతపురం వైద్యం నవంబర్ 6 ప్రభాతవార్త

అనంతపురం ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారిక మద్యం షాపుల పై అనంతపురము స్టేషన్ సిబ్బంది, ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందాలుగా ఏర్పడి విస్కృత దాడులు చేసి కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో కక్కలపల్లి కాలనీకి చెందిన వడ్డే నాగరాజు భార్య అయిన సత్యమ్మ వద్ద 38 మద్యం బాటిళ్లు, అలాగే కూడేరు మండలం ఇప్పేరు గ్రామం నందు బోయ నీలకంఠ వద్ద 25 మద్యం బాటిల్ లో స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేయడమైనదని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనధికారికంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఈఎస్టిఎఫ్ సి.ఐ. జయనాథ రెడ్డి,ఎస్.ఐ. జాకీర్ హుస్సేన్, కృష్ణా రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు హాస్యభారతి

అనంతపురం, నవంబర్ 6 ప్రభాతవార్త బ్యూరో

సమాజంలో ఒత్తిడిని తగ్గిస్తూ అందరిని ఆరోగ్యంగా ఉంచడానికి నవ్వులు పూయించే "హాస్యభారతి" కార్యక్రమాన్ని ఈనెల 8న నిర్వహిస్తున్నట్టు వివేకానంద యోగ కేంద్ర అధ్యక్షులు ఎం.రాజశేఖరరెడ్డి, హాస్య రచయిత తరిమెల అమరనాథ రెడ్డి, కో కన్వీనర్ మానవత సలీం మాలిక్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండవ శనివారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు స్థానిక షిరిడి నగర్‌లోని వివేనంద యోగా భవన్ వేదికగా హాస్య భారతి.. జరుగుతుందని హాస్య ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శింగనమలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు
### - ఎంపిడిఓ భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, నవంబర్ 6 ప్రభాతవార్త

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచనల మేరకు శింగనమలలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఓ భాస్కర్ తెలిపారు. ఆయన గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో అక్కడక్కడ ఆధార్ సెంటర్లు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే మూడు ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమ ంలో డిప్యూటీ ఎంపిడిఓ విజయ్‌కుమార్, పి-4 కోఆర్డినేటర్ రామలింగ, తదితరులు పాల్గొన్నారు.

## 9న లయన్స్‌క్లబ్ ఉచిత కంటి మెగా వైద్యశిబిరం
### - డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, రఘువీర్‌రావ్

పామిడి, నవంబర్ 06 ప్రభాతవార్త

శ్రీ భావసార క్షత్రీయ కళ్యాణ మండపం నందు ఈనెల 9న ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసంస్థ వ్యవస్థాక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, అధ్యక్షులు రఘువీర్‌రావు గురువారం 'ప్రభాతవార్త' ద్వార తెలిపారు. ఉచిత కంటి మెగా వైద్యశిబిరంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు కంటిచూపు మందగించిన వారిని పరీక్షించి అవసరమైన మందులను అందజేస్తూ అవసరమైతే ఆపరేషన్లకు రెఫర్ చేస్తారన్నారు. ఆపరేషన్లకు రెఫర్ అయిన వారిని బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజర్స్ ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్ళి ఆపరేషన్లు చేసిన తరువాత తిరిగి వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తారని తెలియజేశారు. కంటి వైద్యశిభిరానికి హాజర య్యే వారంతా ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పో ర్టుసై జు ఫోటోలు తీసు కుని రావా లన్నారు. మండల ప్రజలు ఉచిత కంటి మెగా వైద్యశి భిరాన్ని సద్విని యోగం చేసు కోవాలని డాక్టర్ నల్లపాటి తిరు పతినాయుడు, రఘువీర్ రావు కోరారు.



డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు,



రఘువీర్‌రావ్

## వృద్ధులకి, వికలాంగులకి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ ఇవ్వాలి

నార్పల,నవంబర్ 6, ప్రభాతవార్త

రేషన్ సరుకుల పంపిణీ లో భాగంగా వృద్ధులు వికలాంగుల ఇల్లవద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలను రేషన్ డీలర్లు ఏమాత్రం పట్టించుకోకుండా తమ స్టోర్ వద్దనే సరుకులు పంపిణీ చేస్తుండడంతో సకాలంలో సరుకులు అందక వృద్ధులు వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి సాకే గంగాధర గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాకే గంగాధర మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 52 షాపులు దాకా డీలర్లు ప్రభుత్వ చౌక దుకాణాలను నిర్వహి స్తున్నారని తెలిపారు, కాగా కొంతమంది డీలర్లు తమకు కేటాయించిన కా ర్డుదారులు ఉన్నచోట కాకుండా ఎక్కడో దూరంగా తమ ఇష్టం వచ్చిన ప్రదేశంలో చౌక దుకాణాన్ని నిర్వహి స్తుండడంతో చాలామంది లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరుకులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ నాయకులు ఆరోపించారు, ఈ పరిస్థి తుల్లో ప్రభుత్వం వృద్ధులు, మరియు వికలాంగుల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినా చాలామంది డీలర్లు అవేమీ పట్టించుకోకుండా తమ రేషన్ దుకాణం వద్దకే రప్పించుకుని రేషన్ సరుకులు పంపిణీ చే స్తున్నారన్నారు. దీంతో వృద్ధులు వికలా ంగులు తమ రేషన్ సరుకులు తెచ్చుకోవ డా నికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సిపిఐ నాయకులు విచారి ంచమన్నారు. ఈ మేరకు సంబంధిత ఉన్నతాధికారులు కూడా ఏమాత్రం పట్టించుకోక ప్రేక్షక పాత్ర వహిస్తు నడంతో చాలా మంది రేషన్ డీలర్లు ప్రభుత్వ ఆదేశా లను పూర్తిగా విస్మరించి వృద్ధులు వికలాంగుల ప ట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని విమ ర్శించారు. ఇప్పటికైనా రేషన్ డీలర్లు వృ ద్ధులు, వికలాంగుల ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. లేనిపక్షంలో త్వరలోనే కార్డుదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందో ళన కార్యక్రమం నిర్వహి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్య దర్శులు చాపల రామంజి, సుధాకర్,మరియు సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



సాకే గంగాధర్

## శ్రీ చైతన్యలో విజయవంతమైన మెగా రక్తదాన శిబిరం

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 6 ప్రభాతవార్త

శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీలక్ష్మిబాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంకు విశేష స్పందన లభించింది. ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీ చైతన్య విద్యాసంస్థల అనంతపురం జోన్ ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శ్రీ చైతన్య విద్యాసంస్థల పాఠశాలలు, కళాశాల సిబ్బంది తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, స్థానికులతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్ ఝాన్సీలక్ష్మిబాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నవంబరు 6వ తేదీన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో ప్రతి ఏటా దాదాపుగా 150 మంది రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికంగా ఉన్న రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో నిర్వహించడం జరిగినది. రక్తదాన కార్యక్రమం శిబిరానికి విచ్చేసిన అశేష జనవాహినికి రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులకు ఏజీఎం సుబ్బారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలకు చెందిన ప్రిన్సిపల్స్, డీన్లు, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి జూస్ అందజేస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

## అనంతను విమర్శించే స్థాయి మీకు లేదు
### - వైసిపి మహిళా విభాగం నగర అధ్యక్షురాలు సాకే చంద్ర లేఖ

అనంతపురం సిటీ, నవంబర్ 6 ప్రభాతవార్త

వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని విమర్శించే స్థాయి, మీకు లేదని వైసిపి మ హిళా విభాగం నగరాధ్యక్షురాలు సాకే చంద్రలేఖ పేర్కొన్నారు. జిల్లా వైసిపి కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో 50 ఏళ్ల పైబడి రాజకీయాల్లో కొనసాగుతున్న అవినీతి మచ్చలేని కుటుంబం అనంత వెంకటరామిరెడ్డి కుటుంబం మాత్రమే నన్నారు. అయితే అవినీతి ఆరోపణలతో భూ కబ్జాలు, దౌర్జన్యాలతో గత 17 నెలలుగా కాలం గడుపుతున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తనవైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు అనంత వెంకటరామిరెడ్డి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు.దగ్గుపాటి చరిత్ర ఏమిటో నగర ప్రజలకు తెలుసున ని ఆమె పేర్కొన్నారు. దగ్గుపాటికి మద్దతుగా మాట్లాడుతున్న ఆ పార్టీ నేతలు తమ స్థాయి ఏమి టో తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. సమా వేశంలో వైసిపి మహి ళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, జిల్లా ఉపాధ్యక్షురాలు రాధయాదవ్, ప్రధాన కార్యదర్శిలు సమర్థాజ్, అంజలి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి మహిళా విభాగం నేతలు

## ఆర్ట్స్ కళాశాలలో డెంటల్ క్యాంప్

అనంపతురం న్యూటౌన్, నవంబర్ 6 ప్రభాతవార్త

నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో డెంటల్ క్యాంపు యూత్ రెడ్ క్రాస్, క్లబ్ ఆధ్వర్యంలో, హ్యాపీ డెంటల్ కేర్ సమన్వయంతో నిర్వహించారు. డాక్టర్ లావణ్య విద్యార్థి విద్యార్థినీ విద్యార్థులకు దంతాల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ లావణ్య మాట్లాడుతూ.. పంటి సమస్యలు వచ్చినప్పుడు తొందరగా డాక్టర్ని కలవాలని అన్నారు.

ఇలా ముందుగా కలవడం వల్ల సమస్య తొందరగా తీరుతుందని అన్నారు. రోజుకి రెండుసార్లు దంత దావనం చేయాలని అన్నారు. అలాగే దంత సమస్యలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. డాక్టర్ లావణ్య గారు విద్యార్థినీ విద్యార్థులకు, అధ్యాపకులకు, అధ్యాపకేతర బృందానికి చాలా ఓపికగా దంతాలను పరీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవి, అరుణ, రుహినాజ్, జ్యోతి, విష్ణు ప్రియ, మహమ్మద్ గారు, ఇంకా ఇతర అధ్యాపకులు పాల్గొనగా, పాల్గొన్న అధ్యాపకులకు విద్యార్థినీ విద్యార్థులకు ఆర్ఆర్సి కోఆర్డినేటర్ గిరిధర్ అభినందనలు తెలియజేశారు.

## బైరెడ్డి సిద్దార్థరెడ్డిని సన్మానించిన బిసి రమేష్‌గౌడ్

అనంతపురం సిటీ, నవంబర్ 6 ప్రభాతవార్త

యువజన విభాగం వైసిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థరెడ్డిని వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి బిసి రమేష్‌గౌడ్ గజమాలతో సత్కరించారు. వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల కార్యక్రమానికి విచ్చేసిన బైరెడ్డి సిద్దార్థ రెడ్డిని నగరంలోని బిసి రమేష్ గౌడ్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తేనేటి విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేస్తోందన్నారు. ప్రజల దృష్టిని తమవైఫల్యాల నుంచి మళ్లించేందుకు వైసిపి నేతలపై అక్రమ కేసులు పెడుతూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందన ఆనరు. అందులో భాగంగా బిసి నేత జోగి రమేష్‌పై అక్రమ మద్యం కేసు బనాయించారని విమర్శించారు. ఈ సంద ర్భంగా వైసిపి నేతలు బైరెడ్డి సిద్దార్థరెడ్డితోపాటు బిసి రమేష్ గౌడ్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 6 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో గురువారం వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రఘునాథ్‌రెడ్డి, కె.నాగరత్నమ్మ, ఎంవి రంగయ్య మానిటరింగ్ ఆఫీసర్స్‌గా వ్యవహించారు. వ్యాసరచన పోటీకి 45, మంది వక్తృత్వ పోటీకి 40, మంది క్విజ్ పోటీకి 45 మంది హాజరయ్యారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జిల్లా వృత్తి విద్యాధికారి, రీజనల్ ఇన్స్‌పెక్షన్ ఆఫీసర్ ఎస్.వెంకటరమణనాయక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి సందింటి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## 8న రాష్ట్రస్థాయి కనకదాసు జయంతి ఉత్సవాలు

అనంపతురం న్యూటౌన్, నవంబర్ 6 ప్రభాతవార్త

ఈ నెల 8న రాష్ట్రస్థాయి కనకదాసు జయంతి ఉత్సవాలను జిల్లాలోని కళ్యాణదుర్గం పట్టణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ తరుపున జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాలోకేష్ ముఖ్య అతిథులుగా హాజరై 9 అడుగుల భక్త కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలతోపాటు అధికారులు, అనధికారులు, ప్రజలు సమాజ పెద్దలు, కుల పెద్దలు, ప్రతినిధులు పాల్గొనాలని వారు సూచించారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నల్లమాడ నవంబర్ 06.ప్రభాతవార్త

మండల పరిధిలోని గోపెపల్లి వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో జనసేనా పార్టీ కార్యకర్తలు అరుంకుమార్, లక్ష్మణ సాయి లు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబాలను గురువారం రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శివశంకర్ తో కలిసి ఆ పార్టీ నాయకులు మృతుల కుటుంబాలకు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఒక్కో కుటుంబానికి రూ.30వేలు చొప్పున అందించారు. మృతుడు లక్ష్మణ సాయి చెల్లెలకు నర్సింగ్ అయ్యే ఖర్చు తనే భరిస్తామని పత్తి చంద్రశేఖర్ తెలిపారు. అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బన్నీ కుటుంబానికి పత్తి చంద్రశేఖర్ రూ.30వేలు ఆర్థిక సాయం అందజేసారు. అయన మాట్లడుతూ మృతుల కుటుంబాలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, జయరాం , మహేష్, సతీష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపికైన తాడిపత్రి క్రీడాకారులు

తాడిపత్రిటౌన్, నవంబర్ 6 ప్రభాతవార్త

కొనకొండ్లలో గురువారం ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి బాలబాలికల సబ్ జూనియర్ సెలక్షన్స్‌లో తాడిపత్రి క్రీడాకారులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇందులో భాగంగా పి.గురుసాయి (బాలురజ ట్టు), వి.అవనిక, ఎస్.అర్షియ, వి.నవ్య, ఎస్.చాందిని, ఎస్.అయిషా (బాలి కల జట్టు)కు ఎంపికయ్యారు. ఈ నెల 7 నుండి 9వరకు పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని కోచ్ లక్ష్మీనరసింహ తెలిపారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

## ఏఎస్‌పిని కలిసిన హెచ్‌ఆర్‌ఏజె టీం సభ్యులు

తాడిపత్రిటౌన్,

నవంబర్ 6 ప్రభాతవార్త

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (హెచ్‌ఆర్‌ఏజె) సభ్యులు గురువారం తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్ కుమార్‌చౌదరిని ఒక సమస్య నిమిత్తం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌పి సమస్యను పూర్తిగా విని దానికి సంబంధించిన విషయాలను తెలుసుకొని ఖచ్చితంగా బాధితురాలుకు సత్వర న్యాయం చేస్తానని తెలియచేశారు. భవిష్యత్తులో ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. దీంతో హ్యూమన్ రైట్స్ వారు ఏఎస్‌పికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షురాలు కాకర్ల సరస్వతి, కరుణకుమార్, గుత్తా భాస్కర్‌నాయుడు, నాగబాబు, శ్రీనివాసులు, శ్రీకాంత్, రవికుమార్, మహబూబ్‌బాషా, రామతులసి, పద్మజ, శంషాద్, తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌పిని సత్కరిస్తున్న దృశ్యం

## అంగన్‌వాడి కేంద్రంలో గర్భవతులకు శ్రీమంతం వేడుకలు

తాడిపత్రిటౌన్,

నవంబర్ 6 ప్రభాతవార్త

పట్టణంలోని 13వవార్డు అంగన్‌వాడి సెంటర్‌లో గురువారం గర్భవతులకు శ్రీమంతం వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు అంగన్‌వాడి సెంటర్‌లో గర్భవతులకు శ్రీమంతం వేడుకలను వార్డు కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే గర్భవతులు తీసుకోవాల్సి న జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళా పోలీస్, ఏఎన్ఎం, అంగన్‌వాడిటీచర్లు, గర్భవతులు పాల్గొన్నారు.



గర్భవతులకు చీరలు అందచేసిన దృశ్యం

## తాడిపత్రి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ఏఎస్‌పికి వినతి

తాడిపత్రిటౌన్, నవంబర్ 6 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో ట్రాఫిక్ పోలీసులను నియమించాలని సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ఏఎస్‌పి రోహిత్ కుమార్ చౌదరి కి వినతిపత్రంనఅందచేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతం పూర్తి అభివృద్ధి చెందడంతో పాటు చుట్టు ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు కావడం జరిగిందని, రోజు తాడిపత్రి ప్రాంత చుట్టుపక్కల గ్రామాల నుంచి ఉపాధి కోసం పట్టణానికి రావడం, అలాగే కార్తీక మాసం వలన భక్తితో ప్రజలు దేవస్థానాలకు రావడం జరుగుతుందని కావునా తాడిపత్రి పట్టణమంతా జన సందోహంతో వుంటుందని, తాడిపత్రి ప్రధాన కూడలి సర్కిల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్ లేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే మెయిన్ బజార్, సిబి రోడ్డు, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డు, నంద్యాల రోడ్డు, కడప రోడ్డులో ఎక్కడ చూసినా వాహనాలు, ఆటోలు ఎక్కడపడితే అక్కడ ఆపడం ప్రమాదాలకు కారణం అవుతూ, వచ్చిపోయే వాహనాలకు అంతరాయం కలిగిస్తున్నారన్నారు. కావున పట్టణంలోని జనసందోహాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఏ విధమైన ఆటంకం కలగకుండా అలాగే ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా ట్రాఫిక్ పోలీసులను ప్రతి సర్కిల్ కూడలిలో నియమించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయకార్యదర్శులు నాగేంద్ర, శ్రీరాములు, అబ్రహాం నాయక్, శీనా, రంగస్వామి, బాబయ్య, వీరనారాయణ, రత్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌పికి వినతిపత్రం అందచేస్తున్న సిపిఐ నాయకులు

## టిఎన్ పల్లి రోడ్డు పనులు పూర్తి చేయాలి

నంబులపూలకుంట,

నవంబర్ 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని టిఎన్.పల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పనులు సంవత్సరాల తరబడి ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారికి కంకర వేసిన దశలోనే పనులు ఆగిపోయాయి. వర్షాలు కురిసిన పుడల్లా రోడ్డు మురుగుతో నిండిపోగా, ఎండలో దుమ్ముతో ప్రయాణం నరకయాతనగా మారుతోంది. పని మొదలు పెట్టి ఆగిపోయి సంవత్సరాలు గడిచాయి. కాంట్రాక్టర్లు వచ్చి కంకర వేసి వెళ్లిపోయారు. తారు వేయక పోవడంతో రహదారి పాడైపోయింది. వాహనాలు నడపడం కష్టమైపోతోందని అక్కడి ప్రజలు అంటున్నారు. ప్రజల డబ్బుతో చేపట్టిన అభివృద్ధి పనులు సగం దాకా చేపట్టి వదిలేయడం బాధాకరమని వారు మండిపడ్డారు. ఈ రహదారిని ఆధారంగా పలు గ్రామాలకు రాకపోకలు సాగుతుండగా, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజలు అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై ఘ్రూటుగా స్పందిస్తూ వెంటనే పనులు పున:ప్రారంభించి, తారు వేయించి రహదారిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



పనులు ఆగిపోవడంతో ఇబ్బందిగా మారిన రోడ్డు


**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT BANGALORE (SCCH-12)**
**MVC.NO. 1757/2025**
**PETITIONERS** : Uppar Savitramma and others
Vs.
**RESPONDENTS** : Kinnara Kranthi Kumar and another
**SUMMONS /NOTICE TO RESPONDENT NO.1**
**Respondent No.1:** Kinnara Kranthi Kumar,S/o Kinnara Chandra mohan, Aged about Major, R/at No.7/9-25, Rehamathnagar, Ananthapura Town, Andhrapradesh - 515001
Whereas the petitioners had filed the above claim petition for Road Traffic Accident against the respondents for a sum of Rs. 20,00,000/- by the 1st respondent vehicle bearing No. AP-39-JV 8851 Toyota Innova car accident place Palli Konda Service Road, Bangalore Vellore NH Road, Pallikonda Flyover on 11.6.2023 at about 8.00 p.m. Hence, 1st respondent is hereby summoned to appear before this Hon'ble Court, either in person or through the pleader on the 8th day of December 2025 at 11.00 AM to answer the same, failing which the matter will be heard ex-parte.
Give under my hand and seal of the Court on this the 4th day of November, 2025.
***By order of the court***
Assistant Registrar, Court of Small causes,Judge at Bengaluru
***ADVOCATE FOR PETITIONERS***
**C.J. Prabhakar,** Advocate, office at No.11, T30, VMC Complex, 10th Cross, Cubbonpet Bengaluru -560 002

**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT BANGALORE (SCCH-12)**
**MVC.NO. 1758/2025**
**PETITIONER**: Uppar Narasimha Murthy
Vs.
**RESPONDENTS** : Kinnara Kranthi Kumar and another
**SUMMONS /NOTICE TO RESPONDENT NO.1**
**Respondent No.1:** Kinnara Kranthi Kumar,S/o Kinnara Chandra mohan, Aged about Major, R/at No.7/9-25, Rehamathnagar, Ananthapura Town, Andhrapradesh - 515001
Whereas the petitioners had filed the above claim petition for Road Traffic Accident against the respondents for a sum of Rs. 5,00,000/- by the 1st respondent vehicle bearing No. AP-39-JV 8851 Toyota Innova car accident place Palli Konda Service Road, Bangalore Vellore NH Road, Pallikonda Flyover on 11.6.2023 at about 8.00 p.m. Hence, 1st respondent is hereby summoned to appear before this Hon'ble Court, either in person or through the pleader on the 8th day of December 2025 at 11.00 AM to answer the same, failing which the matter will be heard ex-parte.
Give under my hand and seal of the Court on this the 4th day of November, 2025.
***By order of the court***
Assistant Registrar, Court of Small causes,Judge at Bengaluru
***ADVOCATE FOR PETITIONERS***
**C.J. Prabhakar,** Advocate, office at No.11, T30, VMC Complex, 10th Cross, Cubbonpet Bengaluru -560 002

**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT BANGALORE (SCCH-12)**
**MVC.NO. 1759/2025**
**PETITIONER** : Uppar Savitramma
Vs.
**RESPONDENTS** : Kinnara Kranthi Kumar and another
**SUMMONS /NOTICE TO RESPONDENT NO.1**
**Respondent No.1:** Kinnara Kranthi Kumar,S/o Kinnara Chandra mohan, Aged about Major, R/at No.7/9-25, Rehamathnagar, Ananthapura Town, Andhrapradesh - 515001
Whereas the petitioners had filed the above claim petition for Road Traffic Accident against the respondents for a sum of Rs. 5,00,000/- by the 1st respondent vehicle bearing No. AP-39-JV 8851 Toyota Innova car accident place Palli Konda Service Road, Bangalore Vellore NH Road, Pallikonda Flyover on 11.6.2023 at about 8.00 p.m. Hence, 1st respondent is hereby summoned to appear before this Hon'ble Court, either in person or through the pleader on the 8th day of December 2025 at 11.00 AM to answer the same, failing which the matter will be heard ex-parte.
Give under my hand and seal of the Court on this the 4th day of November, 2025.
***By order of the court***
Assistant Registrar, Court of Small causes,Judge at Bengaluru
***ADVOCATE FOR PETITIONERS***
**C.J. Prabhakar,** Advocate, office at No.11, T30, VMC Complex, 10th Cross, Cubbonpet Bengaluru -560 002

**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT BANGALORE (SCCH-12)**
**MVC.NO. 1973/2025**
**PETITIONERS** : Smt. Uppar Lakshmi Narasamma and another
Vs.
**RESPONDENTS** : Kinnara Kranthi Kumar and another
**SUMMONS /NOTICE TO RESPONDENT NO.1**
**Respondent No.1:** Kinnara Kranthi Kumar,S/o Kinnara Chandra mohan, Aged about Major, R/at No.7/9-25, Rehamathnagar, Ananthapura Town, Andhrapradesh - 515001
Whereas the petitioners had filed the above claim petition for Road Traffic Accident against the respondents for a sum of Rs. 17,00,000/- by the 1st respondent vehicle bearing No. AP-39-JV 8851 Toyota Innova car accident place Palli Konda Service Road, Bangalore Vellore NH Road, Pallikonda Flyover on 11.6.2023 at about 8.00 p.m. Hence, 1st respondent is hereby summoned to appear before this Hon'ble Court, either in person or through the pleader on the 8th day of December 2025 at 11.00 AM to answer the same, failing which the matter will be heard ex-parte.
Give under my hand and seal of the Court on this the 4th day of November, 2025.
***By order of the court***
Assistant Registrar, Court of Small causes,Judge at Bengaluru
***ADVOCATE FOR PETITIONERS***
**C.J. Prabhakar,** Advocate, office at No.11, T30, VMC Complex, 10th Cross, Cubbonpet Bengaluru -560 002

04ATP06_04ATP06.qxd 06-11-2025 PM 11:42 Page 1



# ప్రతి మనిషికి కంటి చూపే జీవితానికి వెలుగు

## కొత్త చెరువులో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.


ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారం భిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్


కంటి పరీక్షల గురించి తెలుసు కుంటున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

కొత్త చెరువు; నవంబర్ 6 ప్రభాతవార్త

.ప్రతి మనిషికి ఉన్న రెండు కళ్ళు వారి జీవితాలకు వెలుగులు నింపుతాయని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన కంటి వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు కలెక్టర్ శ్యాంప్రసాద్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ముందుగా భగవాన్ శ్రీ సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషికి రెండు కళ్ళ జీవితానికి వెలుగు ను ప్రసాది స్తాయని తెలిపారు.

కళ్ళు లేకపోతే మన జీవితం అంధకారమే అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కళ్ళను అప్పుడప్పుడు వైద్యుల సలహా మేరకు చికిత్సలు నిర్వహించుకుని వెలుగులు పొందాలని సూచించారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మనిషికి కళ్ళు లేకపోతే ప్రపంచం అంధకారంగా ఉంటుందని తెలిపారు. కంటికి పొరలు రాకుండా వైద్యుల దగ్గరికి వెళ్లి శాస్త్ర చికిత్సలు చేయించుకుని కంటికి వెలుగులు పొందాలని కోరారు. మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, కంటి చూపు తోనే ప్రపంచాన్ని చూడవచ్చని తెలిపారు. ప్రతి మనిషికి రెండు కళ్ల ప్రధాన ఆధారమన్నారు. నేటి యుగంలో చాలామందికి కంటి చూపు తగ్గడానికి మొబైల్ వాడకం కంప్యూటర్లు టీవీలు ఎక్కువగా చూడటం వల్ల వీటికి ప్రధాన కారణమ న్నారు. సాధ్యమైనంతవరకు మొబైల్, టీవీల వాడ కాన్ని బాగా తగ్గించాలని కోరారు. మనిషికి కళ్ళు ఎంతో ప్రధానమై నదని వాటికి తగిన జాగ్రత్తలు వైద్యుల సలహా మేరకు పొందాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్ర మంలో డి ఎం హెచ్ ఓ ఫైరోజ్ బేగం డిఐఓ సురేష్ బాబు డిసిహెచ్ఎస్ మధుసూదన్ డిబిసిఓ అనురాధ డాక్టర్లు అశ్విత కుమార్ ఎల్లా రాముడు సిహెచ్ఓ వన్నప్ప స్థానిక ప్రజా ప్రతినిధులు లక్ష్మీనారాయణ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు రామకృష్ణ కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి ,టీచర్ నాగేంద్ర ,హరిప్రసాద్ ,సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గం అభివృద్ధి కోసమే ఆర్ అండ్ బి ఆక్రమిత ఆక్రమణలు తొలగింపు

## - మాజీమంత్రి రఘువీరారెడ్డి ముందుచూపుతో 100 అడుగుల భూసేకరణతో రింగ్ రోడ్డు నిర్మాణం - నేడు రహదారుల అభివృద్ధికి అది సోపానం - కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


లోకేష్ పర్యటన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు


విద్యుత్ స్తంభాల తొలగింపు పర్యవేక్షిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, అక్టోబర్ 6 ప్రభాతవార్త :

విస్తరిస్తున్న కళ్యాణదుర్గం పట్టణం అభివృద్ధిలో భాగంగానే ప్రభు త్వ ఆర్ అండ్ బి స్థలాలను ఆక్రమించి అక్రమంగా నిర్మించుకున్న పక్కా, తాత్కాలిక భవనాలను తొలగిస్తున్నట్లు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు స్పష్టం చేశారు. కంబదూరు రింగ్ రోడ్డు సర్కిల్ లో శ్రీ భక్త కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసి, రాష్ట్ర విద్య అయితే శాఖ మంత్రి నారా లోకేష్ బాబు చేతుల మీదుగా ఆవి ష్కరింపజేసి, ఈ సర్కిల్‌ను కనకదాసు సర్కిల్గా నామకరణం చేయడ ంతో పాటు బస్ స్టాప్ కూడా ఏర్పాటు చేసి ప్రయాణికుల సౌకర్యం కోసం ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పట్టణ సుందరీకరణలో భాగంగా రాయదుర్గం రోడ్డులో నుండి కంబదూరు రోడ్డులోని మోడల్ స్కూల్ వరకు ఐమాక్స్ విద్యుత్ దీపాలతో వెలుగులు నింపనున్నట్లు తెలిపారు. అంతేకా కుండా కళ్యాణదుర్గం పట్టణం వేదికగా కురుమల ఆరాధ్య దైవమైన శ్రీ భక్త కనకదాసు జయంతోత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

ఇప్పటికే పట్టణములోని వాల్మీకి సర్కిల్లో 12 అడుగుల కాంస్య మహర్షి విగ్రహంతో పాటు అత్యాధునికంగా 50 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గాంధీ చౌక్ లో మాత్మ గాంధీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 7 8 తేదీలలో కళ్యాణ దుర్గంలో పర్యటిస్తున్న భావితరాల భవిష్యత్ నాయకుడు నారా లోకేష్ బాబుకు పట్టణంలోని అన్ని ప్రధాన కూడలలో ఘనమైన స్వాగతం లభిం చేలా ఏర్పాటులు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కౌశలతో ఆహ్వానించేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. నారా లోకేష్ బాబు పర్యటనతో పాటు రాష్ట్ర పండుగకు వేదికైనా శ్రీ భక్త కనకదాసు సర్కిల్ చుట్టూ ఉన్న రహదారులను విస్తరించి, సుమారు 50 వేల మంది పాల్గొని విధంగా బహిరంగ సభ ఏర్పాట్లు కూడా సాగుతున్నట్లు తెలిపారు. నారా లోకేష్ బాబు పర్య టన సందర్భంగా సాగుతున్న ఏర్పాట్లను జిల్లా పార్టీ అధ్యక్షులు వెంకట శివ యాదవ్ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్, పరిశీ లకులు నాగేంద్ర యాదవ్ లతో కలసి పర్యవేక్షించారు. ఈనెల ఏడవ తేదీన ప్రజా వేదిక ఆవరణలో నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించే కార్య కర్తల సమావేశంలో ముఖాముఖి నిర్వహించడంతోపాటు పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు ఇచ్చి ప్రోత్సహిస్తారని తెలిపారు. 8వ తేదీన శ్రీ భక్త కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించడంతోపాటు బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. అంతేకాకుండా వెనుకబడిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అనేక విద్య, అభివృద్ధి కార్యక్రమాలపై వరాలు కురిపించే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణం పరిశుభ్రతతో పాటు సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. పట్టణములో అనంతపురం రోడ్డు నుండి సభాస్థలి ప్రజావేదిక వరకు ప్రత్యేకమైన స్వాగత ప్రదర్శన హోర్డింగులు ఏర్పాటు చేశారు. నారా లోకేష్ బాబు పర్యటనలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయడంలో పార్టీ నాయకత్వంతో పాటు ఆర్ అండ్ బి మున్సిపల్ విద్యుత్ శాఖ అధికా రులు తల మునకలై పనిచేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు మేనల్లుళ్లు దేవినేని అవినాష్, ధర్మతేజలు మామకు చేదోడు వాదోడుగా ఉంటూ కార్యక్రమం విజయం కోసం వ్యూహరచన చేస్తున్నారు. ఇదిలా ఉండగా కురుబ సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఊరువాడ తిరుగుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆహ్వాన పత్రికలు పంపిణీ చేసి భారీ ఎత్తున జన సమీకరణ కోసం కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు హాజరు అయ్యాయి భక్త జనులతో పాటు పార్టీ కార్యకర్తలకు, కార్యకర్తలు వచ్చే మార్గాలలోనే భోజనం ఏర్పాట్లు కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని స్థాయిలలో ఏర్పాట్లు సాగుతున్నట్లు తెలుస్తోంది.

# ప్రభుత్వ పాఠశాలల్లో సీటు కోసం పోటీపడేలా విద్యారంగం లక్ష్యం - ఎమ్మెల్యే అమిలినేని

## వివాదాలకు తావులేకుండా డీఎస్సీ నిర్వహణ, ఉద్యోగాలు అందించారు. నారా లోకేష్ కళ్యాణదుర్గం పర్యటనకు రావడం చాలా సంతోషం.. ఎమ్మెల్యే దగ్గుపాటి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని తో పాటు దగ్గుబాటి వెంకటేశ్వరరావు

కళ్యాణదుర్గం రూరల్ నవంబర్ 6 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నారా లోకేష్ ఐటీ, విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యా అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతు న్నారని, ఆయన లక్ష్యం ఒక్కటేనని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సీట్లు లేవని బోర్డులు పెట్టె పరిస్థితి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎమ్మెల్యేని సురేంద్రబాబు పేర్కొన్నారు మంత్రి పర్యటన నారా లోకేష్ పర్యటన 8వ తేదీ ఉండగా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరులతో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావు తో పాటు ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మన కళ్యాణదుర్గం కరణం చిక్కప్ప పాఠశాలలో 1500 విద్యార్థులతో సీట్లు లేవని బోర్డు పెట్టారని ఇదే రాష్ట్రమంతా చూడాలని లోకేష్ పనిచేస్తున్నారన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని శెట్టూరు రోడ్డులో నారా లోకేష్ బస చేసే స్థలం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్ర బాబు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పార్టీ పరిశీలకులు నాగేశ్వర్ యాదవ్ తో కలసి పరిశీలిం చారు.. అనంతరం కనకదాసు సర్కిల్ వద్ద జరుగుతున్న సభా వేదిక ఏర్పాట్లు, విగ్రహ విష్కరణ ప్రాంతం, హైమస్ లైట్లు, జయంతి వేడుకలకు వచ్చే ప్రజల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి రేపటి ఉదయానికి పనులు అన్ని పూర్తి అయ్యేలా చూడా లని అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పి రవిబాబు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ సి ఐ నీలకంఠేశ్వర టిడిపి నాయకులు గురు ప్రసాద్ టి ఆర్ తిప్పేస్వామి కుమార్ బ్రహ్మ సముద్రం సింగిల్ విండో చైర్మన్ అంకె ఓబులేసు రూరల్ కన్వీనర్ గోళ్ళ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ సురక్ష ఆప్ ద్వారా నకిలీ మద్యాన్ని సులభంగా గుర్తించవచ్చు


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డి సి నాగమద్దయ్య

అనంతపురం వైద్యం నవంబర్ 6 ప్రభాతవార్త

ప్రభుత్వం మద్యం నాణ్యత ప్రజలు తామే తమ ఫోన్ ద్వారా కనుగొనుటకు రూపొందించిన ఎక్సైజ్ సురక్ష మొబైల్ ఆప్ ను ప్రతి వినియోగదారునికి చేరే విధంగా చర్యలు చేపట్టాలని ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నాగమద్దయ్య అనంతపురము జిల్లా, శ్రీ సత్యసాయి జిల్లాలలోని అన్ని స్టేషన్ల ఇన్స్పెక్టర్లు ఎన్ఫోర్స్మెంట్ ఈఎస్టీఎఫ్ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు.గురువారం అనంతపురం , సత్యసాయి ఎక్సైజ్ సూపరింటెండెంట్ లు రామ్మోహన్ రెడ్డి,గోవిందనాయక్ ల తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశం లో ఆయన మాట్లాడుతూ మద్యం షాపుల్లో మరియు బార్లలో ప్రతి ఒక్క మద్యం బాటిల్ ఎక్సైజ్ సురక్ష ఆప్ ద్వారానే అమ్మకాలు జరపాలని లైసెన్సుదారులకు తెలియజేయలన్నారు. మొబైల్ ఆప్ ద్వారా అమ్మకాలు జరపని షాపులు బార్ల పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెల్ట్ షాపులు మొత్తం నియంత్రించాలని ఎక్కడా కూడా అనధికారికంగా మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపు నిర్వాహకులను బైండోవర్ బైండోవర్ చేయాలని ఆన్నారు. ఈ సమావేశంలో నవోదయం 2.0 పై క్షుణ్ణంగా సమీక్షించారు. ఇందులో భాగంగా ఇప్పటికే నాటు సారా రహిత గ్రామాలుగా ప్రకటించిన గ్రామాల్లో మళ్లీ నాటుసారా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం అయినది అదేవిధంగా కల్తీకల్లు పై గట్టి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ఎస్.రేవతి, బి. నరసింహులు, ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీ రామ్ రెండు జిల్లాలోని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారుల జోలికి వస్తే సహించేది లేదు.. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

## ఇది జగన్ సైకో ప్రభుత్వం కాదు....ప్రజాసంక్షేమ కూటమి ప్రభుత్వం..వైసీపీ గూండాలు, ఆకురౌడీలు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి..రోళ్ల ఎంపీడీఓపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను.


ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

మడకశిర టౌన్ నవంబర్ 6 ప్రభాతవార్త.

మడకశిర నియోజకవర్గం, రోళ్ల మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రిపై వైసీపీ గూండా విజయరంగేగౌడ్ చేసిన దాడిని ప్రభుత్వంపై దాడిగా పరిగణిస్తున్నాం. రాష్ట్రంలో ప్రజలు పారదర్శకంగా ఎన్నుకున్న విజనరీ లీడర్ చంద్రబాబు. సారథ్యంలోని ప్రజాసంక్షేమ ప్రభుత్వం అధికారంలో ఉంది. కూటమి పాలనలో రౌడీలు, గూండాలు, ఆకురౌడీల ఆటలు సాగవు అని తీవ్రంగా హెచ్చరిస్తున్న మన్నారు. వైసీపీ నేతలు, రౌడీలు, గూండాలు, ఆకురౌడీలు, పిల్లరౌడీలు ఒళ్లు దగ్గరపెట్టుకుని వ్యవహరించాలి. ప్రజల మన్ననలు పొందలేని చేతకాని దద్దమ్మలు ఆ కోపాన్ని నిజాయితీగల అధికారులపై చూపించడం దుర్మార్గం. జగన్మోహన్ రెడ్డి సైకో పాలనలో విచ్చల విడిగా రెచ్చిపోతే ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. కారణాలు ఏవైనా కావొచ్చు కాని ప్రభుత్వ అధికారుల పై దుర్భాషలాడడం, పిడిగుద్దులు గుద్దడం పూర్తిగా ఆటవిక చర్య అని అన్నా రు. దీనిని తీవ్రంగా ఖండి స్తు న్నాను. విజయరంగేగౌడ్ చేతి లో దాడికి గురైన రోళ్ల ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంద న్నారు ఉంటుందన్నారు.

# నారా లోకేష్ గపర్యటన ఏర్పాట్లను టీడీపీ నాయకులుతో కలసి పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం నవంబరు 06 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా కళ్యాణదుర్గం పట్టణం నందు భక్త కనకదాసు 538వ జయంతి వేడుకలను, అలాగే కనకదాసు విగ్రహావిష్కరణ, సర్కిల్ కు నామకరణం చేసేందుకు విచ్చేస్తున్న విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరిశీ లించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు , జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ , కర్నూల్ డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర్ యాదవ్, టిడిపి నాయకులతో గురువారం కలిసి పరిశీలించారు. నారా లోకేష్ సమావేశం ఏర్పాట్లు, కనకదాస సర్కిల్, వాల్మీకి సర్కిల్లలో ఏర్పాట్లను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పరిశీలించారు.

# ప్రజలకు సౌకర్యాల కల్పనే మాధ్యేయం - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


మరువ కొమ్మ వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

శింగనమల, నవంబర్ 6 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని శింగనమల క్రాస్ వద్ద నూతన జాతీయ రహదారి నుంచి వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి పూట తాడిపత్రి నుంచి అనంతపురం నుంచి వచ్చే ప్రజలకు ఇబ్బందులు పడుతుండటంతో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రజలకు సౌకర్యార్థం బస్టాప్ వద్ద చీకటిగా ఉండటంతో ఈ విషయాన్ని గమనించిన ఆమె ఏపి ట్రాన్స్‌కో వారి సహకారంతో స్థానిక పంచాయితీ సర్పంచు, కార్యదర్శిల సహకారంతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లను వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు సౌకర్యాల కల్పనే ధ్యేయ ంగా కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. శింగమల మరువకొమ్మవద్ద విద్యుత్ దీపాలు వేయించడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# జగన్మోహన్‌రెడ్డిని కలిసిన నక్కా నారప్ప

## - ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలను ఎండగడుతూ ప్రజలకు అండగా నిలవండి - వైసీపీ శ్రేణులకు జగన్మోహన్‌రెడ్డి దిశానిర్దేశం


జగన్మోహన్‌రెడ్డితో నక్కా నారప్ప.

పామిడి, నవంబర్ 06 ప్రభాతవార్త

వైసీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు, మండల పరిదిలోని దేవరపల్లికి చెందిన నక్కా నారప్ప గురువారం తాడేపల్లి కేంద్ర కార్యాల యం లో ఆపార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. రాబోయేది మన ప్రభుత్వమే అని మీరంతా పాలకులు అవలంభి స్తున్న నిర్లక్ష్య విధానాలను ఎండగడుతూ ప్రజలకు అండగా నిలువాలని జగన్మోహన్‌రెడ్డి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మన (వైసీపీ) ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచిందని అయితే ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఆ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ మెడికల్ కళాశాల లను ప్రైవేటీకరించాలని కుట్ర పన్నుతోందని మీరంతా ప్రభుత్వం అవలం భిస్తున్న ద్వందనీతిని నిరశిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం గుంతకల్లు నియోజకవర్గంలో పార్టీ కార్యకళాపాలు, నాయకుల పనితీరుపై జగన్మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరశిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలంటూ శ్రేణులకు ఉద్బోధించిన జగన్మోహన్‌రెడ్డి ప్రజలతో మమేకమై మన (వైసీపీ) ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు సాధించిన ప్రగతిని వివరిస్తూ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, పార్టీ ప్రధాన కార్య దర్శి నైరుతీరెడ్డి, జిల్లా ఆర్గనై జింగ్ సెక్రెటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి నేతృత్వంలో గుంతకల్లుపై మరోసారి వైసీపీ జెండాను ఎగురవేసి నియోజకర్గ ఎమ్మెల్యే గా వై.వెంకట్రామిరెడ్డిని మి మ్మల్ని (జగన్మోహన్‌రెడ్డి), తిరిగి ముఖ్యమంత్రిగా చేయటానికి అహర్నిశలు శ్రమిస్తామని ఆయనకు తెలియజేసినట్టు నక్కా నారప్ప వెల్లడించారు.

# నేటి నుంచి రెవెన్యూ క్రీడలు అన్ని ఏర్పాట్లు పూర్తి - జెసి శివ్ నారాయణ్ శర్మ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

అనంతపురం, కలెక్టరేట్ నవంబర్ 06 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలో నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములను నిర్వహించడం జరుగుతోందని, రెవెన్యూ క్రీడల కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. గురువారం ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములకు సంబంధించిన రిహార్సల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములు నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జరుగుతున్నాయన్నారు. ఈ క్రీడల్లో రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగులు పాల్గొనడం పట్ల చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందులో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, తదితరులు పాల్గొనడం జరుగుతుందన్నారు. అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములు అనంతపురం జిల్లాలో నిర్వహించడం జరుగుతోందని, ఈ క్రీడలను ఇంతకుముందు నిర్వహించిన విధంగానే విజయవంతంగా నిర్వహిస్తామ న్నారు. ఇందులో భాగంగా ఈరోజు రిహార్సల్స్ నిర్వహించామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములకు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొనడం జరుగుతోందని, ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి. రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఆర్డీఓలు కేశవ నాయుడు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లికార్జున రెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, రమేష్ రెడ్డి, తిప్పేనాయక్, రెవెన్యూ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు, సెక్రటరీ సోమశేఖర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సంజీవరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సత్యసాయి ఏపీఆర్ఎస్ఏ ప్రెసిడెంట్ మధునాయక్, మీడియా ఇంచార్జి మునివేలు, డిఎస్డీఓ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# .ప్రతి ఒక్కరికి చదువు అవసరం - వయోజన విద్య డిడి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వయోజన విద్య డిడి వెంకటేశ్వర్లు


శిక్షణ కార్యక్రమానికి హాజరైన వాలెంటీర్లు

శింగనమల, నవంబర్ 6 ప్రభాతవార్త

నేటి ప్రపంచంలో ప్రతి ఒక్కరికి చదువు అవసరమని వయోజన విద్య డిడి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్‌పై వాలెంటీర్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్య డిడి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ శ్రీధర్, ఎంఈఓ నరసింహరాజు, వెలుగు ఏపిఎం ఈశ్వరయ్య, ఉపాధి ఏపిఓ భాగ్యలక్ష్మి, మండల పరిధిలోని ఆనిమేటర్లు, సిసిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాలెంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిష్టాత్మకంగా చదువురాని వారు ఎవరూ ఉండకూడదని అందులో భాగంగా ప్రతి రోజు గ్రామాలలోని వారికి వారికి అనుకూలమైన పాఠశాలలో సాయంత్రం నిరక్ష్య రాస్యులకు విద్య నేర్పించేందుకు వాలెంటీర్లనలు ఏర్పాటు చేసిందని, ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# బోరు బావుల విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 6 ప్రభాతవార్త

బోరు బావులకు విద్యుత్ సౌకర్యము నిమిత్తం ఇదివరలో రూ.29,72,725 లక్షలు విడుదల కావడంతో తదుపరి బోరు బావికి విద్యుత్ సౌకర్యం కొరకు కొందరు ఉమ్మడి జిల్లా గిరిజన రైతులు (విద్యుత్ సౌకర్యం) కొరకు దరఖాస్తు చేసుకున్నారు. కాని ఇటీవల వేసిన ఎస్టిమేషన్స్ అన్నియును క్యాన్సిల్ అయినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమము నుంచి విద్యుత్ శాఖ, అనంతపురం వారికి లేఖ ఆర్‌సి నెం.ట్రైకార్/339498/2024 15తేదీ లేఖ వ్రాశారు. వారు ఇచ్చిన సమాచారం ప్రకారం చాలా ఎస్టిమేషన్స్ మనుగడలో లేవని దృవీకరించారు. కావున ఎగ్జ్యూక్యూటివ్ ఆఫీసర్, ఎస్‌టి కార్పోరేషన్ (ట్రైకర్) అనంతపురం వారి ఆదేశముల మేరకు బోరు బావులకు విద్యుత్ సౌకర్యము కావాల్సిన వారు ఉమ్మడి జిల్లా గిరిజన రైతులు (అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా) అర్జీ, రూ.50 సంబంధిత ఎఈ రిజిస్ట్రేషన్ చేసి పిఆర్ స్లిప్, పాసు పుస్తకం జిరాక్స్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులము సర్టిఫికెట్, సెల్ నెంబర్, బోరు దగ్గర నిలబడిన రైతు ఫోటోలు నకలు కాపీలను జతపరచి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, అనంతపురం కార్యాలయము వారికి 28వ తేది లోగా సమర్పించాలని కోరారు.